# ౩

# పెద్దూరు

పిట్టకబుర్లు చెప్పడంలో ఘట్టు కొండుభట్టు. ఉన్నవోకొన్ని, లేనివోకొన్ని, తనకు తెలిసినవోకొన్ని, తెలియనివోకొన్ని పేర్లుమార్చి కథలమాదిరిగా కల్పించి, వినేవారికి విసుగు లేకుండా చెబుతాడు 'వాకలగరువు' వుంటే 'పోగలపాలెం' అనీ, 'పేరూరు' వుంటే 'పెద్దూరు' అనీ 'అమలాపురం' ఉంటే 'నిర్మలాపురం' అనీ 'రామయ్య' అయితే 'వెంకయ్య' అనీ 'శ్రీరంగపట్నం' వుంటే 'శంకరగిరిమన్యం' అనీ ఇలాగ్గా మార్చి నవారల్లినట్లల్లుతాడు — ఎంతచిత్రంగా నన్నా — ఓనాడు చెప్పేడతడు.

"నిర్మలాపురం మునసబుకోర్టులో పూర్వం నర్సయ్యశర్మ అనే అమీనాగారుండేవారలు. ఇక్ష్వాకుల కాలమ్మాట. ఆరోజుల్లో బ్రాహ్మణులే చాలామంది అమీనాలుగా వుండేవారట, — జప్తులు చేసినా, ఋణస్థుల్ని పట్టుకున్నా, ఏలాలు వేసినా వారేనట. అమీనాహోదా అంటే మునసబుగారి తరువాత హోదాగా ఉండేదట ఆలా మునసబుగారు జప్తు ఆర్డరువేస్తే మధ్య నాజరుగారి ప్రమేయం లేకుండా అమీనాగారు తిన్నగా ఆ ఆర్డరే తీసికొని అమలుజరుపుతూ వచ్చే రివాజట,

ఆ కాలంలో ఆ కోర్టు మునసబుగారు కూడా వాళ్ళకు తగ్గా ఆయనే దొరికేడు. ఆయన సంస్కృతమంటే చెవి కోసుకొనే రకం. పురాణం వినడం అంటూ వస్తే భోజనమున్నా సరే, కోర్టుపని అయినాసరే, మానేసేసి, ఇవాళ కోర్టు మత్త రవు, అని ఎక్కడపడితే అక్కడ పురాణంలో లీనం అయిపోయే మనిషి. సాక్షిబోనులో కెక్కితే వాని వరస చూచి శాస్త్రిల్లుగారైనా యొక్క శ్లోకమైనా చదివించకుండా వెళ్ళనీయడు. కొండొకచో సాక్షి వాఙ్మూలాల్లోకి అనాయాసంగా శ్లోకాలు కూడా దొర్లుకు పోతూనే వుండేవి అనీ, అవి అప్పీలు కోర్టువారు బ్రాకెట్లల్లో పడేసి మిగతా వాఙ్మూలమే చదివే వారనీ హైకోర్టు ప్లీడర్లు చెప్పేవారు.

మన వెంకయ్యగారు కోర్టు ఆవరణలో ప్రవేశించి యెక్కడన్నా ఆయన వియ్యంకుడుగారైన అమీనాగారు నరసయ్య శర్మగారు అగపిస్తారేమో అని వెదికి చూచి, కానక, ఇప్పటి నుంచీ పోకలపాలెం వెళ్ళి మాత్రం చేసేదేమిటి ఇక్కడే ఈ బ్రాహ్మణ్యంతో కాస్సేపు ముచ్చటిద్దామని రావిచెట్టు క్రింద ఓరసిలగ కూర్చున్నారు.

కూర్చుని ఆలా రావిచెట్టుకేసి చూస్తూంటే ఆయన పురాణ భక్తుడు కాబట్టి ఆ రావిచెట్టే పొన్నచెట్టు అయిపోయి ఆ కృష్ణమూర్తి గోచరించి ఆయనచేత మొదట్లో అస్పష్టంగా "రాధే గోవిందకృష్ణ" "రాధే గోపాలకృష్ణ" లోలో అనిపించి

నారు. క్రమంగా అది లోపల పట్టలేక పైకి పాడుతూ గంతులేసినారు. ఎవరు ? శంకరగిరి మన్యాంలోనుంచి వచ్చిన వెంకయ్యగారు. ఆ గంతులకు చుట్టూ వున్న బ్రాహ్మణ్యం చేరి వెంకయ్యగార్ని ఎరక్కపోయినా మహాభక్తునిగా గుర్తించి చుట్టూ కూర్చుండి చూచేరు. చూస్తూవుండేలోపలే, వెంకయ్యగారు వ్యాసప్రోక్త భాగవతములోని రాసక్రీడఘట్టము కంఠోపాఠంగా ఒప్పజెప్పుతూ ఫెళ్ళున ప్రత్యక్షశయ్యా నర్థము సెబుతూ తాండవమాడిపొయ్యేరు. బ్రాహ్మలందఱూ తమర్ని తామ్మఱచి ఆయనచుట్టూ కూర్చున్నవాళ్లల్లా నిలుచుండి గోపికల్లాగ తిరగడం మొదలుపెట్టినారు.

లోపల్నుంచి కోర్టువారువిని "ఏమిటోయి గల్లంతు? ఎవరోయి అమీనాలు అక్కడ? ఆ గల్లంతుచేసే మనిషిని ఇలా లాక్కురండి" అన్నారు. అక్కడప్పుడున్న అమీనాల్లో ఉన్నాయన శర్మగారే. అప్పుడే యేదోవేలం, అక్కడే పాటదార్లచేత సంతకాలుచేయిస్తూ పూర్తిచేసినారు. కోర్టువారి మాటవిని వెంటనే తనచేతిలోని కాగితాలు మడతపెట్టి వారెంటు ఇలాకా గుమాస్తాకిచ్చి, తాను "ఎవరాగల్లంతు?" అంటూ యీవలకు వచ్చేసరికి, బ్రాహ్మణ్యమంతా తమకొంప మునిగిందనుకొని పారిపోయినారు. వెంకయ్యగారుమట్టుకు 'రాధే గోవిందకృష్ణ. రాధే గోపాలకృష్ణ' అని స్మరించుకుంటూ అక్కడే వుండిపోయినారు. ఆయన్ని అమీనాగారు, మన శర్మగారు, రెక్కదొరక

బుచ్చుకొని 'రాండి! కోర్టువారు పిలుస్తున్నారు!' అన్నారు. శర్మగార్ని వెంకయ్యగారు వెంకయ్యగార్ని శర్మగారు పోల్చుకున్నారు. సంబంధీకులుగా గ్రహించుకున్నారు. కాని అలాంటి పరిస్థితుల్లో ఏమీ పైకనుకోవడం బాగుండదనో ఏమో కేవలం లాతివాళ్లలాగే ప్రవర్తించేరు.

శర్మగారు వెంకయ్యగారి రెక్కపట్టుకొని లోపలకు తీసుకు వెళ్లేసరికి కోర్టువారు దిగ్గునలేచి 'ఇలా దయచెయ్యండి' అని ఆయన సరసనే యొక కుర్చీ వేయించి కూర్చోమన్నారు. కోర్టులో వున్నవారంతా నివ్వెరపడిపోయేరు. 'కోర్టు మర్తరవు' అన్నారు మునసబుగారు. తరువాత వెంకయ్యగారి దిక్కుమొగంపై "మీరు పండితులనితోచి తీసుకురమ్మన్నాను. అంతే. పరాయి వారనికాదు. మీరక్కడ 'రాధాగోపాలకృష్ణ' అని అంటూంటే నాకిక్కడ కలంనడవక ఆగిపోయింది వినబడి. ఈరాత్రికి మీరు నాయింటనుండిపోయి పురాణంచెప్పాలి" అన్నారు. "తమసెలవైతే ఇంతకంటేనా?" అన్నారు వెంకయ్యగారు. "ఎక్కడికి వెళ్ళాలిమీరు?" అన్నారు మునసబుగారు. అప్పుడు వెంకయ్యగారు శర్మగారికేసి చూచి "వీరమ్మాయిని మా అబ్బాయికిచ్చారు. కోడల్ని శ్రావణశుక్రవారం నోముగ్గాను, తీసుకొని వెడదామనివచ్చే" నన్నారు వెంకయ్యగారు. 'ఓ మాశర్మగారి వియ్యంకుడుగారా! మీరు? శర్మా! మీ యింటికి రేపుదయం హూ మేనాలో మీ వియ్యంకుడుగార్ని వారికేలోపం లేకుండా పంపించివేస్తూ వున్నాను. నీవువెళ్లు. నీపనిచూచుకో' అన్నారు.

ఆరోజుల్లో ఉద్యోగస్థులు ఎక్కడకు వెళ్ళడం వచ్చినా మేనాల మీదనే వెళ్ళేవారు. కోర్టుకు రావడం మేనా మీద వచ్చి మన మునసబుగారు దేహపరిశ్రమకాస్త వుండాలంటూ ఇంటికి వెళ్ళేటప్పుడు నడచి వెళ్ళేవారు. కాని మేనా గుమ్మం లో ఎప్పుడూ అరుగుమీద వుండేది. బోయీలు వాకిట్లో నిరంతరం వుండేవారు పొద్దుగూకిపోయేదాకా. ఆకారణంగా ఇంటికి వెళ్ళి వెళ్ళడంతోటే పై సంభాషణమైనాక, మునసబుగారు చాకలివాళ్లను రాత్రి తమయింటివద్దే పరుండమనీ తూర్పు తెల్లారేలో వెంకయ్యగార్ని శర్మగారింట దిగబెట్టవలసిందనీ హుకుం జారీ చేసినారు.

మునసబుగారు వెంకయ్యగార్కి మర్యాదపోపేతంగా గుడువ విందుపెట్టి తివాసీ పరిచింపి పెద్దసభ గావించి వెంకయ్యగారి చేత అష్టాదశ పురాణాల్లోని సంగతులు వచ్చేటట్టుగా తెల్లవార్లు చెప్పించేరు. తెల్లవారుతూండగానే "వెంకయ్యగారూ తమరీ మేనాలో దయచేసి మీ వియ్యంకుడుగారింటికి వెళ్లవలసిందని నాప్రార్థన" అన్నారు మునసబుగారు. మునసబుగారు స్వయంగా "ఓ పిరిగా! ఓ పేరిగా! ఓ పుల్లిగా!" అనిచాకలి వాళ్లను కేకేసి "ఎత్తండి మేనా ఎత్తండి" అని అన్నారు. వెంకయ్యగారు "ఎందుకండీ మేనా గీనా!" అన్నాగాని మునసబుగారు "పల్లకి తన కేలపట్టి యెత్తె" నన్నట్లు తాం కూడా చేయేసి సాగనంపినారు. పెద్దండుము వెంకయ్యగారు! ఏం ప్రతిభ! ఏం ప్రజ్ఞ! అనుకుంటూ లోపలికి వెళ్ళిపోయినారు.

ఇక శర్మగారైనా 'మీరు వెళ్లండి' అని మునసబుగారన్న పాళంగా అక్కడ వుంటే ఏంటక్లో అని తిన్నగా పెద్దూరు మీదుగా పోకలపాలెం దాటిపట్టేరు. అప్పుడు పెద్దూరు బ్రాహ్మణ్యం అంతా ఆయనచుట్టూమూగి "బాబూ మేమక్కడుంటే మమ్మల్నందర్నీ మీరు నిన్న కొట్లోకి తోసేసేవారే!" అన్నారు. శర్మగారు నవ్వుతూ "ఎంత వెఱ్ఱిబ్రాహ్మణ్యం అయ్యా మనది! ఆయన మా వియ్యంకుడుగారు మా రెండోఅమ్మాయి పెళ్ళికిమూడే వుండేరు. మఱచి పోయినారేమోగాని. ఆయన్ని మునసబుగారు – కోట్టుమునసబుగారు మర్యాదచేసి తమ ప్రక్కన కూర్చో పెట్టుకున్నారు గాని, కొట్లో పెట్టించలేదు. ఈ రాత్రి వారింట పురాణం చెప్పి రేపుదయం మీ వూరిమీదుగా వారి మేనాలోవచ్చేరు." అని మెహర్బాణీగా అడేసివెళ్లిపోయినాడు.

పెద్దూరి బ్రాహ్మణ్యం అక్కడ ఆ పెద్దూర్లో — ఇక్కడ మునసబుగారింట్లో వెంకయ్యగారు పురాణం చెప్పుతూ వుంటే అక్కడ ఆ పెద్దూర్లో ఆ బ్రాహ్మణ్యం ఓసభ చేసినారు ఆరాత్రి. "మన వూరిమీదుగా ఇదివఱ కుద్యోగస్థులమేనాలు ఎప్పుడూ వెళ్ళలేదు. రేప్పొద్దున్న మునసబుగారి మేనా ఇలా వెడుతుందట, ఆయన్నెవరోనీతీసికొని (అహంభావములో ఆ బ్రాహ్మణులకప్పుడు అంత క్రితం వాళ్లను గంతులు వేయించిన వెంకయ్యగారు ఎవరో అయిపోయినారు) వెడుతుందట! మనమంతా అడ్డుతగలాలి. కఱ్ఱలుచ్చుకు ఎవరిగుమ్మంలో వాళ్లం నిలుచుని

వున్నట్టుగా నించోని ఆసవాకీ చెక్కలు విఱిగేటట్టు చితగ్గొడదాం" అని తీర్మానించుకున్నారు,

శర్మగారి కదేంతెలీదు. వెంకయ్యగారి కంగారెంటే తెలీదు. వెంకయ్యగారు తెల్లవారడంతోనే పూర్వోక్త ప్రకారంగా మేనాఎక్కి చాకలివాండ్రు 'ఓంబాయి' అనిమామూలు ప్రకారం కేకలు వేసికొంటూ మోసికొనిరా, వూగుతూ వున్నారు. ఇంటిదగ్గఱ శర్మగారు వియ్యంకుడుగా రొస్తారని మర్యాదగా చాపా అదీ వేసి కాళ్లు కడుక్కోవడానికి నీళ్లూ అంగోస్త్రం పెట్టి ఎదురు చూస్తూవున్నారు,

కొంతదూరం వెళ్ళిన తరువాత పెద్దూరుగుండా మేనావచ్చే సమయానికి చాకలి వాళ్లు చూచేరు పెద్దూరు బ్రాహ్మణ్యం కఱ్ఱలేసుకు గుమ్మాల్లో నిలబడ్డం. సవారిదింపితే తమకీ, మేనాలోకూర్చున్నవారికీ, మునసబుగారికికూడా నామోషే. దింపకపోతే సవారీ పగలగలదు. వాళ్ళ బుఱ్ఱలున్నా:— వాళ్లకేం తట్టిందో తత్క్షణం చాకలివాళ్లంతా మామోలుకేక మానేసేసి "ఉద్యోగస్థుల మేనాకాదిది ఓంభాయిఓం! విద్యావంతుల మేనా అండోయి ఓంభాయిఓం!" అంటూ మోసుకెళ్లేరు, ఊరావలికంటా, ఎక్కడున్న బ్రాహ్మణులక్కడ ఎత్తినకఱ్ఱలలా వాలుగా వుంచేసేరు, విద్యావంతుల మేనా అనేసరికి అప్పుడాకఱ్ఱలు ఆమేనా మీద ఎలావున్నాయి అంటే బాలభటుల కఱ్ఱలు

కనక మర్యాదకోసం బాలఘటనాయకుని నెత్తిమీదకు పట్టినట్టు 'అర్చి' కట్టి గౌరవం సూచించినాయి.

లోపలున్న వెంకయ్యగారు ఆ కేకమూర్పు తెలిసికొని తరువాత ఆ చాకలివాళ్ళ తెలివికి నిర్ఘాంతపోయి "ఎవరు చెప్పేర్రా? మీకు నేను విద్యావంతుణ్ణి" అని అడిగేరు "ఎవరు సొప్పాలిబాబూ! మా బ్రతుకు దెరువు చెప్పిం" దన్నారు. అలా అనకపోతే మా బుర్రలు పగిలి పోవడమే అయియుండేదీ పాటికావుళ్ళో." అన్నారు.

"విద్యావంతులు అంటే ఆ గ్రామంలో అంత గౌరవమున్న. ఉద్యోగస్థులంటే అంత ఆతతాయితనమూనా! ఏవూరు అది!" అని అడిగేరు వెంకయ్యగారు. "పెద్దూరు" అన్నారు శర్మగారు ఎదురొస్తూ..



| రచన | స్ఫురణ | తొలి ప్రకటనము |
|---|---|---|
| 24-11-1982 | కోనసీమ | "వినోదిని"లో |